

ఇంద్రనీలాలు

పాలకోడేటి వేణు

ఎందుకు శ్రీనివాసరావుకి ఆ కళ్ళంటే ఇష్టమో చెప్పలేడు. ఆ కళ్ళు మీనాల్లాంటివా? కావు. కొందరికి నీలి కళ్ళంటే యిష్టం. మరికొందరికి తేనె రంగు కంటి పాపలున్న కళ్ళంటే యిష్టం ఇవేమీ లేనివి శ్యామల కళ్ళు కాని అవే శ్రీనివాసరావుకి ప్రాణం. ఆ కళ్ళల్లో ఏదో తెలియని, ఇది ఫలానా అని నిర్వచించలేని అనుభూతి శ్రీనివాసరావుకి కలుగుతుందా? అంటే ఔనని సిగ్గుపడ్డాడు. తననే వో వింతలోకాలకి తీసుకుపోతున్నాయి ఆ కళ్ళు అంటాడు శ్రీనివాసరావు. తను ఎన్నేళ్ళయినా ఎన్ని యుగాలైనా ఆ కళ్ళల్లోకి చూస్తూ గడిపేయగలనంటాడు. ఆ కళ్ళని తన కళ్ళతో చూడమంటాడు. ఆ కళ్ళ గొప్పదనం మన దగ్గర వర్ణిస్తాడు. ఆ కళ్ళలాంటి కళ్ళు యీ భూప్రపంచంలో మరెవ్వరికీ లేవంటాడు

ఆ కళ్ళ వోనరు రెండు పదులు దాటని శ్యామల. చామనఛాయ మనిషిని కట్టిపడేసే టంత అందం కాదామెది. కాని ఒకసారి చూస్తే మరోసారి చూడాలనిపిస్తుంది. అంతే! చదువు ఇంటర్మీడియట్ రెండుసార్లు తప్పి మూడోసారి అతికష్టంమీద అత్తెసరు మార్కులతో ఔననిపించుకొంది ప్రస్తుతం ఏం చెయ్యాలో తోచక, టైపు నేర్చుకుంటూంది.

బ్రతకలేక బడిపంతులన్నట్లు, గోవిందరావు గారు ఓ ఎలిమెంటరీ స్కూలికి హెడ్మాస్టరుగా పనిచేసి రిటైరయ్యారు — అదీ నిర్బంధంగా ఏభై అయిదు ఏళ్ళకే రిటైరు చేయించబట్టి.

మరో మూడేళ్ళు సర్వీసుందికదాని కూతురు శ్యామల పెళ్ళి వాయిదా వేసేరు. కాని హటాత్తుగా రిటైర్‌కావడం ఆయనని మానసికంగా కృంగదీసింది. పైకి గంభీరంగావున్నా లోపల కుమిలిపోతున్నారు. ఇప్పుడెలా అమ్మాయికి సంబంధం కుదర్చడం? ఇంత హటాత్తుగా ఎక్కడ నుండి వేలకువేలు కట్నం తెచ్చి గుమ్మరించగలడు? అంతా అగమ్యగోచరంగా తయారైంది గోవిందరావుగారి పరిస్థితి.

పోనీ రిటైర్ అయిన వెంటనే పెన్షన్ వచ్చేటట్లు చేస్తామని ప్రభుత్వం హామీ యిచ్చినా ఆ హామీని ఇంతవరకు పట్టించుకొనే నాథుడే లేకపోయాడు. పెన్షన్ రాకపోతేమానె, కోర్టుకు వెళ్ళని వాళ్ళందరికీ మొదట రెండు నెలల జీతం తరువాత మూడు నెలల జీతం ఇమ్మని కోర్టు ఆదేశాలిచ్చినా, ఐదునెలల జీతం పదినెలల దాటినతరువాత వొచ్చింది.

జీతం రాళ్ళు తప్ప మరే ఇతర ఆదాయమూ లేని గోవిందరావుగారు తనకంటూ ఆస్తిగాని,

కళాసాగర్ (మదరాసు) ఆధ్వర్యంలో సినీనటుడు మురళీమోహన్ సమర్పించిన విశాఖ బహురూప నటసమాఖ్యవారి ''వేట కుక్కలు'' నాటక ప్రదర్శనానంతరం దర్శకుడు శ్రీ ఎస్. కె. మిశ్రోని అభినందిస్తున్న ప్రముఖ నిర్మాత శ్రీ వై. వి. రావుగారిని చిత్రంలో చూడవచ్చు.

ఇంద్ర నీలాలు

చిన్నసైజు పెంకుటిల్లు గాని నిలబెట్టుకోలేక పోయారు. కాని, ఆయన ముప్పైఏళ్ళ సర్వీసు లోనూ తనకంటూ మిగుల్చుకోగలిగినది గుండె మీద కుంపటిలా వున్న పెద్దకూతురు శ్యామల, అక్క బరువు దిగేసరికి నా బరువు నీ గుండెల మీదకి ఎక్కిస్తానంటున్న యీ మధ్యనే రజస్వల అయిన రెండో కూతురు రజని, ఇక మూడోవాడు టెంత్‌క్లాస్ సెకండ్‌క్లాస్‌లో పాసయి, ఇంటర్మీడియట్‌లో కావలసిన గ్రూపు దొరక్క దొరికిన గ్రూపుతో సరిపుచ్చుకొన్న బాబు అనబడే మోహన్.

గోవిందరావుగారు ఇన్ని బరువులతో యింకా బ్రతికి వుండగలుగుతున్నారంటే, నిశ్చింతగా వున్నట్టు పైకి కనపడగలుగుతున్నారంటే దానికి కారణం గోవిందరావుగారి భార్య మహాలక్ష్మిగారు.

ఏనాడైతే ఆమె ఆయన యింట్లో అడుగు పెట్టిందో, ఆనాటి నుంచి గోవిందరావుగారు బాధలు పడలేదని కాదుగాని, ఆమె మూలాన బాధలనుంచి ఆయనకు ఏదో తెలియని రిలీఫ్ కలిగేది. కష్టాలు ఎంత తీవ్రమయినవైనాసరే ఆమె ఓదార్పు మాటలతో వుపశమించేవి అనిపించేదాయనకు.

తండ్రి మరణించిన రోజున, తనకు లోకం అంధకారబంధురంగా కనబడింది. అప్పుడు ఆవిడ మాటలను తను జీవితాంతం మర్చిపోలేననిపించి దాయనకు.

''ఏమండీ ! మీరలా బాధపడకూడదు. మీరే అలా దిగులు పడితే మీకంటే చిన్నవాళ్ళు మరీ బెంబేలెత్తిపోతారు. మీరు ఇంకా చెయ్యాల్సిన పనులు చాలావున్నాయి.''

ఇవి అందరూ వుపయోగించే అతిసామాన్య మయిన ఓదార్పు మాటలు. కాని అవే మాటలు చెప్పే తీరులో తనకేదో తెలియని ఓదార్పు, నిశ్చింత లభించేయి ఆయనకు. అప్పుడామె ఆయనకు భార్యలా కనిపించలేదు. ఎవరో దేవత ఒడిలో పసిపాపలా వున్నట్లు, అతని దుఃఖం అంతా చేత్తో తీసి ఆమె అవతలపారవేసినట్లు అనిపించిందాయనకు.

ఇప్పుడు యీ పరిస్థితులలో, నెలనెలా వచ్చే జీతం రాళ్ళు ఇక బంద్ అయినాయి. పచారీ షాపువాడు సరుకులు ఇవ్వడం తగ్గించాడు. వుద్యోగం వున్న రోజులలో అయితే, ''పంతులుగారూ ! మీరు అంతగా చెప్పాలిటండీ, ఈ నెల్లో కాకపోతే వచ్చేనెల్లో మిగిలిన బాకీ తీర్చేద్దురుగాని'' అనేవాడు. ఇప్పుడు బజార్లో ఎదురుపడితే మొహం చాటేస్తున్నాడు.

రంగాచారి, అదే పచారీ షాపువాడు, వ్యంగ్యంగా అంటున్న మాటలు తన చెవిన పడుతున్నాయి అప్పుడప్పుడు.

మొన్నటికి మొన్న, మోహన్ సరుకులకోసం వెడితే, చాలాసేపు నిలబెట్టి వుంచి, ఏదో సణుక్కుంటూ కేజీ అడిగితే అరకేజీ చొప్పున సరుకులు ఇచ్చాడట, ఇంతకు ముందు ఎంత కావాలంటే అంత పట్టుకెళ్లమనే రంగాచారి.

గోవిందరావుగారికి నవ్వొచ్చింది. ఇదీ ప్రస్తుత సమాజం. 'ధనమూల మిదం జగత్' అని పెద్దలు వూరికే అనలేదు. ఎన్ని ప్రణాళికలు వేసినా యీ భారతదేశంలో మధ్యతరగతి మనిషి స్థితి పెరిగేదెప్పుడు ? ఎప్పుడు మధ్యతరగతి మనిషి అటు ధనం ఎక్కువైపోయిన తరగతికి చెందక, ధనహీనులైన అట్టడుగు దరిద్ర నారాయణుల స్థితికి దిగజారలేక, మధ్యలో త్రిశంకు స్వర్గంలో వ్రేలాడుతున్న పరిస్థితి నుంచి బయట పడతాడు?

అయితే గోవిందరావుగారికి ఆస్తి ఎందుకు లేదూ, ఇల్లు ఎందుకు కట్టించలేదు ? ఈ ప్రశ్నలే మరోలా వేస్తే బాగుంటుంది. గోవింద రావుగారు ఆస్తి ఎందుకు సంపాదించుకోలేక పోయారు. ఇల్లు ఎందుకు కట్టించుకోలేక పోయారు. ఈ ప్రశ్నలకి సమాధానం గోవింద రావ్ గారి దగ్గర వున్నది. అది 'ఆదర్శం' నైతికవిలువలకి కట్టుబడి వుండడమనేది. అలా వుండడం వలన లభించిన ఆత్మ సంతృప్తి.

వాళ్ళబ్బాయి పదో క్లాసు పాసయేలా చేస్తే వెయ్యి రూపాయగా ఇస్తానన్న ఇన్‌కంటాక్సు ఇనస్పెక్టరు మాటల్ని ఖాతరు చెయ్యలేదు. వాళ్ల కూతురు కొడుకులకి ప్రైవేట్లు చెబితే నెలకి రెండు వందలిస్తానన్న తాహసిద్దారు గారి మాట కాదన్నారు ఎందుకు ?

ఇది మీకు చాలా ఉపయోగం

మీకు "వ్యవహారదర్శిని" అనే తెలుగు పుస్తకం చాలా ఉపయోగం. అందులో ఆస్తికొన్నా అమ్మినా తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యాపార, పరిశ్రమలకెలాంటి లైసెన్సులు తీసుకోవాలి, అన్ని మతాల వివాహ, విడాకుల నిబంధనలు, స్త్రీ పురుషుల ఆస్తిహక్కులు, చెడ్డవారితో ప్రమాదం రాబోతే పోలీసురక్షణకు ఎవరికెలా వ్రాయాలి, ఇండ్లస్థలాలకెలా దరఖాస్తు పంపాలి, లాడ్జింగుల్లో, వ్యభిచారనిరోధ రూల్సు, వాటినుంచి రక్షణ వివరాలు, మీరు తెలుసుకోదగిన అనేక చట్టాల వివరాలు, నోట్సు, దస్తావేజులు, ఒప్పందాలు, పిటీషన్లు, ఫిర్యాదులు, ఉత్తరాలు, ఎలా వ్రాయాలి. వాటి వివిధ నమూనాలు అందున్నాయి. పుస్తకం ధర రూ.12 వి.పి పోష్టు ఖర్చు రూ.3 అదనం. దేశసేవ ప్రచురణలు, నెం.2 ఇందిరానగరు, వెంగళరావునగరు టాంకు సమీపాన, హైదరాబాదు 500890 కు, మీ ఉపయోగానికి "వ్యవహారదర్శిని పుస్తకం ఒకటి వి.పి. పోష్టు ద్వారా పంపించమని నేడే ఉత్తరం వ్రాయండి. ఇది మీ వ్యవహారాల సామర్థ్యాన్ని పెంచుతుంది.

డా. కె.యల్. నారాయణ

వైద్యవిద్వాన్, వైద్యాచార్య

చర్మవ్యాధులకు, స్త్రీల వ్యాధులకు, పక్షవాతం, సుఖ వ్యాధులకు, సెక్సు, నరముల బలహీనతలకు, ఆయుర్వేద చికిత్స.

పోస్టుద్వారా చికిత్స కలదు.

లక్ష్మీకుమారి క్లినిక్,

మెయిన్ రోడ్, తెనాలి.

ఈ రోజుల్లో కాలేజీలో సీటు రావాలన్నా హైస్కూల్లో సీటు రావాలన్నా, కనీసం కిండర్ గార్డెన్‌స్కూల్లో సీటు రావాలన్నా డబ్బుకావాలి— నైతిక విలువలు కావు.

ఈ సమాజంలో మనిషి జీవనానికి, డబ్బుకి అంత అవినాభావ సంబంధం వుంది. ఇద్దరు వ్యక్తులు ఒకేసారి వుద్యోగాల్లో జాయినైనై, ఓ పదేళ్లలో ఒకరు కారులో తిరిగే స్థితికి వస్తే, రెండో వాడు ఇంకా సైకిల్ కూడా కొనలేని స్థితిలో ఉంటే, అందుకు ఎవరిది తప్పు ?

ఎదుటి వాళ్ళ తప్పుల్ని లేదా బలహీనతల్ని కాష్ చేసుకుంటూ పైకి ఎదిగిన, యీ సంఘంలో ఒక ముఖ్య వ్యక్తిగా మొదటి వ్యక్తి గుర్తించబడితే, రెండో వ్యక్తి కేవలం ఆత్మ సంతృప్తి, నైతిక విలువలు లాంటి ఆదర్శ భావాలతో ఎప్పుడు ఈ సమాజంలో పైకి ఎదగ గలడు ?

అందుకే గోవిందరావుగారు మామ్మూలు గోవిందరావుగారిలా మిగిలిపోయారు. ఆయనకు మిగిలినవి ఆయన ఆదర్శభావాలు, ప్లస్ రెండు గుండెలమీద కుంపట్లు.

రామారావుగారు పక్క వూళ్ళో ఎలిమెంటరీ స్కూలికి హెడ్మాస్టరుగా చేస్తూ ఆయన కూడా కంపల్సరీ రిటైర్‌మెంట్ క్రింద రిటైర్ చెయ్యబడ్డారు.

ఆయన రెటైరైన మరుచటి నెలలోనే ఇరవైవేలు కట్నం యిచ్చి కూతురికి ఓ యింజనీర్ని కొనుక్కొచ్చేరు. కొడుకుని ఎం. బి. బి. యస్ చదవడానికి విశాఖపట్నం ఓ పదిహేనురోజుల క్రితం పంపించేరు.

రామారావుగారు జ్ఞానం వొచ్చిన దగ్గర్నుండి నైతిక విలువలు, ఆదర్శాల్లాంటి బరువైన పదార్థాల్ని తాకట్టు పెట్టేసి, యీ సమాజంలో ఉన్నత స్థితికి చేరుకొని, ఇప్పుడు ఎదుటివాళ్ళ నైతిక విలువల్ని, ఆదర్శాల్ని తన దగ్గర తాకట్టు పెట్టించుకొంటున్నారు.

గోవిందరావుగారు ఆ పని చేతకాక మామ్మూలు బడిపంతులుగా మిగిలిపోయేరు.

* * *

''నమస్కారం మాష్టారూ.''

''ఎవరూ ...'' కళ్ళజోడు సవరించుకొంటూ ఎదుటి వ్యక్తిని గుర్తుపట్టడానికి ప్రయత్నించేరు.

''నేను మాస్టారూ ! శ్రీనివాసరావుని ... వాసుని ... ''

''ఓ నువ్వటోయ్ వాసూ ! రారా ... ఏమిటి, ఎలా వున్నావ్ ? ఏం చేస్తున్నావ్ ? ఈ వూరు ఎప్పుడొచ్చేవ్ ... మీ అమ్మగారు, నాన్నగారు బావున్నారా ... '' కుశల ప్రశ్నలు వేసేరు.

''నేనీ వూరువచ్చి అయిదు నెలలయిందండి. మా అన్నయ్య ఇక్కడ ఇన్‌కంటాక్సు ఆఫీసులో పనిచేస్తున్నాడు. అమ్మానాన్నా బాగానేవున్నారు. క్రిందటి సంవత్సరం బి.కాం. పూర్తయింది. ఇప్పుడు వుద్యోగ ప్రయత్నాలు చేస్తూ ఎం.కాం. ప్రైవేట్‌గా చదువుతున్నాను ... ''

''అమ్మాయ్ శ్యామలా! కొంచెం మంచినీళ్ళు పట్రామ్మా ... '' లోపలికి కేకవేసేరు.

శ్రీనివాసరావు హైస్కూలు చదువంతా గోవిందరావుగారి దగ్గరే గడిచింది. తర్వాత శ్రీనివాసరావు నాన్నగారికి శ్రీకాకుళం బదిలీ కావడంతో అక్కడ మిగతా చదువు పూర్తి చేశాడు.

ఆడేటైమ్‌లో ఆడుకోవడం, చదివే టైమ్‌లో చదుకోవడం ఇవి శ్రీనివాసరావుకి గోవిందరావుగారు నేర్పినవి. క్రమశిక్షణ కు ప్రాణం ఇచ్చేవారాయన.

ప్రక్క ప్రక్క ఇళ్ళు కావడంతో శ్రీనివాసరావు ఎప్పుడూ గోవిందరావుగారింట్లోనే తిరుగుతూ వుండేవాడు.

''మన వాసు ... '' మంచినీళ్ళు తెచ్చిన శ్యామలతో అన్నారు.

''అన్నట్టు అమ్మతో చెప్పవాసు వొచ్చేడని.. ఆ చేత్తోనే కాఫీ కూడా పట్రమ్మను ...''

శ్రీనివాసరావు కళ్ళముందు మెరుపు మెరిసినట్లయింది.

''ఈ అమ్మాయినే నేను రోజూ ఆరాధించేది ? ఈ అమ్మాయికోసము ప్రత్యేకంగా టైపు నేర్చుకుంటున్నది...''

''న...న... నమస్కారం.''

''మీలో మీరు గౌరవించుకోడాలేమిటోయ్'' మృదువుగా మందలించేరు శ్యామలకు నమస్కారం పెడుతున్న శ్రీనివాసరావుని చూసి.

''ఏం చేస్తున్నానో తెలియడంలేదండి'' అనబోయి తమాయించుకొన్నాడు.

''నమస్కారమండి...''

''నమస్కారం... ఏంవోయ్ వాసూ ! బాగున్నావా అమ్మా నాన్నా అంతా కులాసాయేగా'' కుశల ప్రశ్నలు వేశేరు మహాలక్ష్మిగారు.

''ఆ... అంతా బాగానే వున్నారండి ..'' సమాధానమిచ్చేడు శ్రీనివాసరావు.

అది మొదలు శ్రీనివాసరావు రాకపోక లెక్కువయ్యేయి. గోవిందరావు మాస్టారు ఎప్పుడో ఇంట్లో ఉండకుండావుంటే బాగుంటుం దనిపిస్తోంది శ్రీనివాసరావుకి. శ్యామలతో మాటలు పెరిగేయి. చనువుగా జోకులెయ్యడం లాంటివి చేస్తున్నాడు శ్రీనివాసరావు. మహాలక్ష్మి గారుగాని, గోవిందరావుగారుగాని శ్యామలతో శ్రీనివాసరావు చనువుగా మాట్లాడినా పట్టించుకోవడంలేదు — చిన్నప్పటినుంచి తెలిసిన వాడవడంచేత.

మైనా గోరింకకు మాటలు నేర్పుతున్నట్లు శ్రీనివాసరావు శ్యామలకు ఆమెకు తెలియని ప్రపంచం చూపించే ప్రయత్నాలు చేస్తున్నాడు.

రోజులు గడుస్తున్నాయి. గోవిందరావుగారి ఆర్థిక పరిస్థితిలో పెద్దగా మార్పులేదు. మరో రెండు మూడు నెలలలో పెన్షన్ ఫిక్సయి రావచ్చునని ఆశిస్తున్నారు గోవిందరావు గారు.

* * *

''మాస్టారూ ! నాకు ఉద్యోగం వొచ్చింది'' అన్నాడు శ్రీనివాసరావు ఆనందంగా...

''చాలా సంతోషం నాయనా... ఎక్కడ, దేంట్లో వొచ్చింది ... ఎప్పుడు జాయినవ్వాలి'' ప్రశ్నలువేసేరు.

సమాధానంగా శ్రీనివాసరావు జేబులోంచి ఒక ఇన్‌లాండ్ కవరు తీశాడు.

శ్రీనివాసరావు నాన్నగారి చేత వుపకారం పొంది పై చదువులు చదువుకొని ఇప్పుడు అతి పెద్ద వుద్యోగంలో ఉన్న వెంకట్రావుగారు ఇప్పుడు తన కంపెనీలో ఉద్యోగాల కోసం పంప





బడ్డ దరఖాస్తులలో శ్రీనివాసరావు అప్లికేషన్ గుర్తుపట్టి ప్రత్యేకంగా వుత్తరం వ్రాస్తూ ఇంటర్వ్యూ ముందు రోజు తనను కలవమని చెప్పి, ఆ వుద్యోగం శ్రీనివాసరావుకు వచ్చేలా చేస్తానని వుత్తరం వ్రాసేరు.

ఇది ఆ వుత్తరం ముందు వెనకల కథ. శ్రీనివాసరావు ఆనందంగా వున్నాడు ...

*　　　*　　　*

మనిషి అనుకున్నవి జరిగితే యీ లోకంలో మనిషికి అడ్డు వుండదు. అప్పుడప్పుడు తగిలే ఎదురు దెబ్బలు మనిషిని నిలువుగా కృంగ దీస్తుంటాయి.

గోవిందరావుగారు గుండెపోటుతో మరణించారు ఈ లోకంలో తన పాత్రకు పూర్తి న్యాయం చెయ్యకుండానే తనువు చాలించేరు. వచ్చిన బంధువులు సానుభూతి వాక్యాలు పలికి వెళ్ళిపోయారు.

ఆ సంసారం బాధ్యత మహాలక్ష్మిగారి మీద పడింది భర్త పిఎఫ్, గ్రాట్యుటీ ఇంకా రాలేదు. ఎప్పుడు వస్తాయో తెలియదు. ఆ పరిస్థితులలో శ్రీనివాసరావు దగ్గరుండి చెయ్యవలసిన సాయం చేసేడు.

''రేపు కంపెనీకి వెళుతున్నానండి ... ఎల్లుండి నా యింటర్వ్యూ... రేపు వెంకట్రావు గారిని కలవాలి'' శ్రీనివాసరావు అన్నాడు.

'ఆ వుద్యోగమే కదా వాసూ ... నీకు వస్తుందన్నావు ...'' ఏదో చెప్పబోయి ఆగిపోయారు.

'అవును...' ప్రశ్నార్థకంగా చూశాడు.

''నీకు మా పరిస్థితులు తెలుసు ... ఈ పరిస్థితులలో...'' మళ్ళీ ఆగిపోయారు.

ఇంద్ర నీలాలు

''చెప్పండి ఫరవాలేదు...'' ఆవిడ ఏం చెప్పదలచుకున్నారో అర్థం కాలేదు శ్రీనివాసరావుకి.

ఒక నిశ్చయానికి వొచ్చినట్లు దీర్ఘంగా నిట్టూర్చారు మహాలక్ష్మిగారు.

''నేను చెయ్యమంటున్న యీ సహాయం నీకు విపరీతంగా అనిపించవచ్చు. ఇంత స్వార్థం పనికిరాదనవచ్చు. కాని రేపట్నుంచి మేము కనీసం ఒక పూటయినా తిండి తినగలగాలంటే ... మా శ్యామల ఉద్యోగం చెయ్యడం అవసరం... వాసూ ! నీకు రాబోయే వుద్యోగాన్ని మా శ్యామలకు వచ్చేలా చేశావంటే ...'' ఆగిపోయారు. చెప్పవలసినదింకేమీ లేనట్టు శ్రీనివాసరావు మొహంలోకి చూడడానికి ధైర్యం చాలక మొహం ప్రక్కకి తిప్పుకున్నారు.

షాక్ కొట్టినట్లయింది శ్రీనివాసరావుకు... తేరుకొని :

'ఇప్పుడు మీకేమీ చెప్పలేను...రేపు ప్రొద్దున్న మీకే విషయమూ చెప్తాను...' గబగబా వెళ్ళిపోయాడు.

*　　　*　　　*

రాత్రి పడుకున్నాడే గాని శ్రీనివాసరావుకి నిద్ర పట్టలేదు ఏం చెయ్యాలి. నిజమే యీ పరిస్థితులలో శ్యామల ఉద్యోగం చెయ్యడం ఎంతో అవసరం. శ్యామల ఉద్యోగం చెయ్యకపోతే ఆ యింట్లో పూట గడవడం కష్టం. ఒకర్ని దేహీ అని చెయ్యిచాచని ఆ కుటుంబం రేపు నడిరోడ్డు మీద నిలబడవలసి రావచ్చు ...

'అమ్మా ! ధర్మం చెయ్యండమ్మా' అని మోహన్ అడుక్కుంటున్నట్లనిపించి, ఆ వూహే భయంకరంగా తోచి గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.

మరో విషయం, తను ఇప్పుడు శ్యామలకు సహాయం చేస్తే ఆ వుద్యోగం శ్యామలకు ఇస్తారా ? ఇస్తారు. ఎందుకంటే ఆ వుద్యోగానికి కావలసిన కనీసార్హత ఇంటర్మీడియట్ మాత్రమే. ఈ సహాయం చెయ్యకపోతే శ్యామలకు వుద్యోగం వస్తుంది. ఎందుకు రాదు. వస్తే ఎంతకాలం పడుతుంది. రికమండేషన్, డబ్బులతో నడిచే యీ లోకంలో శ్యామల లాంటి వాళ్ళకు, అందులో అగ్రజాతి వాళ్ళకు ఉద్యోగం వొచ్చేదెప్పుడు ... ?

మరి తన పరిస్థితి ... తనలాంటివాళ్ళు ఈ దేశంలో కోట్లమంది వున్నారు. తనకు మాత్రం యీ వుద్యోగం రాకపోతే మరో వుద్యోగం వొస్తుందన్న నమ్మకంగాని, గ్యారంటీ గాని లేదు ...

తను వుద్యోగం చెయ్యవలసిన పరిస్థితి ఎంతవుంది ? తను వుద్యోగం చెయ్యకపోతే గడవని పరిస్థితులేమీకావు. ఈ అన్నయ్య దగ్గర ఓ ఆరునెలలు, మరో అన్నయ్య దగ్గర మరో ఆర్నెలు గడపవచ్చు.

కాని ... శ్యామల తప్పకుండా వుద్యోగం చేసి తీరాలి.

శ్రీనివాసరావుకి ఏదో ఫ్లాష్‌లా వెలిగింది. దృఢనిశ్చయానికి వచ్చినవాడిలా నిశ్చింతగా నిద్రపోయేడు.

*　　　*　　　*

తెల్లవారింది. ఫ్రెష్‌గా తయారయేడు. తను తీసుకొన్న నిర్ణయాన్ని ముందుగా వదినగారికి చెప్పాడు. ఆవిడ ముందు కోపగించుకొంది నచ్చచెప్పిన తరువాత ఈ కాలం యువకులు ఎంత ముందుకు పోయేరు అని ఆశ్చర్యపోయింది తరువాత అభినందించింది. మీ అన్నయ్యకు నేను నచ్చచెపుతాన్లే అంది ... ధైర్యంగా అడుగులు వేసేడు శ్రీనివాసరావు.

టైమ్ ఏడుగంటలయింది.

వాకిట్లో ముగ్గులేస్తున్న శ్యామల అతని కళ్ళకి రోజూ కంటే అందంగా కనబడింది.

''శ్యామలా ... మీ అమ్మగారు లేరా ...''

''ఓ నువ్వా ... ఏమిటి ఇంత పొద్దున్నే దర్శనం.''

''దేవిగారికోసం...''

సిగ్గుపడింది శ్యామల.

''మహాలక్ష్మిగారితో మీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి'' అని గొంతు సవరించుకొన్నాడు.

''నిన్న మీరు చెప్పిన విషయాన్ని ఆలోచించి నేను తీసుకొన్న నిర్ణయమేమిటంటే'' ఆగాడు.

''శ్యామలా ! కొంచం మంచినీళ్ళు తెచ్చిపెట్టు'' శ్యామలవైపు తిరిగి అన్నాడు.

''అలాగే...'' లోపలికి వెళ్ళింది

''చెప్పు వాసూ. .'' ఆవిడ గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

గబగబా కిటికీదగ్గరకు వెళ్ళాడు.

కిటికీలోంచి బయటకు చూస్తూ...

''ఈ విషయం మా యింట్లో చెప్పాను. ఈ పరిస్థితులలో నాకు వచ్చిన యీ వుద్యోగాన్ని మీ అమ్మాయికి వచ్చేలా చెయ్యడంకంటే...'' క్షణం ఆగి...

''మీకు అభ్యంతరం లేకపోతే ఆ వుద్యోగం నేనే చేస్తూ మీ అమ్మాయిని పెళ్ళి చేసుకుందా మనుకొంటున్నాను...'' ఎవరో తరుముకు వొస్తున్నట్లు గబగబా చెప్పేశాడు.

మంచినీళ్ళు తెస్తున్న శ్యామల అక్కడే ఆగిపోయింది... కొంత సిగ్గుతోనూ, ఎక్కువ భాగం ఆశ్చర్యంతోనూ.

మహాలక్ష్మికి సమాధానం ఏం చెప్పాలో తోచలేదు. తన కళ్ళముందు నిక్కర్లు వేసుకొని తిరిగిన వాసు... ఎంతో ఎత్తుకి ఎదిగిపోయినట్లనిపించింది. ఆనందంతో ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి. గొంతు పూడుకుపోయింది. ★